క్లుప్తంగా

గుడివాడ టూటౌన్ సీఐగా హనీష్



గుడివాడరూరల్: గుడివాడ టూటౌన్ సీఐగా జేఆర్‌కే హనీష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ కంట్రోల్ రూమ్ సీఐగా పనిచేస్తున్న హనీష్ బదిలీపై గుడివాడకు వచ్చారు. తొలుత సీఐకు స్థానిక సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన చిన్ని నాగప్రసాద్‌ను ఏలూరు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి ఫైన్

గుడివాడరూరల్/నందివాడ: మద్యం తాగి వాహనాలు నడిపే 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా రూ.లక్ష అపరాధ రుసుం విధించినట్లు తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, నందివాడ ఎస్‌ఐ కె.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపే 10 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఒకసారి మద్యం తాగి పోలీసులకు దొరికిన వారు మరోసారి దొరికితే డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడంతో పాటు జైలు శిక్ష కూడా పడుతుందని పేర్కొన్నారు.

468 మందికి వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 468మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరితిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, సాధారణ వైద్యానికి హోమియో వైద్యురాలు పి.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

శాకంబరీదేవిగా అమ్మవారు

మండవల్లి: వారాహి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. మండవల్లి విజయదుర్గా ఆలయంలో వారాహి నవరాత్రులను ఆలయ అర్చకుడు సీహెచ్ శ్రీనివాసరావు ప్రారంభించి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆకివీడు ఆమని నృత్య కళానిలయం వారిచే నిర్వహించిన కూచిపూడి భరతనాట్యం చూపరులను ఆకట్టుకుంది.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంతో సహా ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు.

గురుభక్తికి నిదర్శనం ఏకలవ్యుడు



కలిదిండి(కైకలూరు): గురుభక్తికి నిదర్శనంగా ఏకలవ్యుడు జగత్తులో ప్రసిద్ధి చెందాడని ఏకలవ్య సంఘ కలిదిండి మండల అధ్యక్షుడు కుంభ నాగరాజ పేర్కొన్నారు. ఏకలవ్య జయంతి సందర్భంగా కలిదిండిలో ఏకలవ్య విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, నాయీ బ్రహ్మణుల కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ.. కేసు నమోదు

పామర్రు: స్థానిక శివరామకాంప్లెక్సులో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక చాట్లవానిపురానికి చెందిన చాట్ల చిన్న రమేష్ కాంప్లెక్సులోని అమలేశ్వరి ఎలక్ట్రానిక్స్ షాపు యజమానికి మధ్య తీవ్ర ఘర్షణ జరిగిందని పేర్కొన్నారు. ఇరు వర్గాలు ఈ విషయమై స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాయని తెలిపారు. ఈ మేరకు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పామర్రు: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రపాల్ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నాయకులు గంగాధర్, ఇంటి రాజు, ఉమారాణి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మోనూ కచ్చితంగా పాటించండి

పెదపారుపూడి: హాస్టల్ విద్యార్థులకు మోనూ ప్రకారం కచ్చితంగా నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి అవనిగడ్డ దివ్య అన్నారు. పెదపారుపూడి బాలుర బీసీ హాస్టల్‌ను ఆదివారం తనిఖీ చేశారు. అక్కడ తయారు చేసిన పాయసాన్ని రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో భక్తులు



పామర్రు విష్ణాలయంలో గీతా పారాయణం చేస్తున్న భక్తులు

కైకలూరు: భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు నియోజకవర్గం ప్రముఖ ఆలయాల్లో ఆదివారం జరిగాయి. వేకువజామునే భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కైకలూరు శ్యామలాంబ, రామలింగేశ్వర తదితర ఆలయాల్లో ఏకాదశి పూజలు నిష్ఠతో నిర్వహించారు. మీసాల వెంకన్నలాలయంలో శ్రీమన్నారాయణ గోష్ఠి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యలో వికాస తరంగణికి చెందిన మహిళలు విష్ణు పారాయణం చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన చేశారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో విశేష పూజలను చేశారు. స్థానిక విష్ణాలయంలో స్వామికి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గీతా భక్త భజన సమాజం వారిచే భగవత్ గీతాపారాయణ, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణ చేయగా పలువురు భక్తులు పాల్గొన్నారు.

అలీనఖీపాలెంలో చెస్ట్‌బీటింగ్



ఐలూరులో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



తురాయిపాలెంలో పీర్ల ఊరేగింపు



అలీనఖీపాలెంలో చెస్ట్‌బీటింగ్‌లో పాల్గొన్న ముస్లింలు

పమిడిముక్కల: మొహర్రం సందర్భంగా మండలంలోని అలీనఖీపాలెంలో షియా ముస్లింలు ఆదివారం రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళులర్పించారు. గ్రామంలోని గదీర్, హుస్సేన్ కమిటీల ఆధ్వర్యంలో వేర్వేరుగా మసీదుల్లో చెస్ట్‌బీటింగ్ చేశారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానికి ప్రతీక మొహర్రం. ప్రాణ త్యాగం చేసిన కర్బలా అమరవీరులను స్మరించుకోవడమే మొహర్రం. మొహర్రం మాసం 10 రోజులపాటు ముస్లింలు దుఃఖదినాలు పాటించారు. 10వ రోజు మొహర్రం సందర్భంగా శోకగీతాలు ఆలపిస్తూ యువకులు, చిన్నారులు, వృద్ధులు జింజర్లు, బ్లేడ్లుతో చెస్ట్‌బీటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో పీర్లను ఊరేగించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక మొహర్రం అని, మొహర్రం అంటే పండుగ కాదని మత గురువులు పేర్కొన్నారు. వీరంకిలాకు పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో సీఐ చిట్టిబాబు, ఎస్‌ఐ శ్రీను బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

తోట్లవల్లూరు: ఐలూరులో మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొహర్రంను పురస్కరించుకుని స్థానిక పీర్లపంజా వద్ద శనివారం రాత్రి నిప్పులగుండం నిర్వహించారు. యువకులు ఆదివారం ఉదయం చెస్ట్‌బీటింగ్ జరిపి రక్తం చిందించారు. సాయంత్రం గ్రామంలో పీర్ల ఊరేగింపు జరిగింది. ముస్లిం పెద్దలు షేక్ జబ్బార్, అమీర్‌ఖాన్, హసన్, ఆరిఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: మొహర్రం సందర్భంగా ముస్లింలు ఆదివారం పట్టణంలో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ ఆరీఫ్, నాజీమున్నీసా, అల్తాఫ్‌రజా, కె. బాజీ, అహ్మద్ బేగ్, అబ్దుల్ అలీమ్, సయ్యద్ ఇర్ఫాన్, రహీమున్నీసా, అజీజ్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: తాగ్యానికి ప్రతీక మొహర్రం అని పఠాన్ బషీర్ ఖాన్ తెలిపారు. ఆదివారం మొహర్రం పురస్కరించుకుని గుడ్లవల్లేరు మండలంలో తురాయిపాలెం, కొతవరంలో పీర్ల ఊరేగింపును చేపట్టారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాన్, సలాం ఖాన్, ఆసిఫ్ ఖాన్, జానూ ఖాన్, బుడ, చాన్ భాషా పాల్గొన్నారు.

కాజలో..

కాజ(మొవ్వ): మొవ్వ మండలంలోని కాజ, నిడుమోలు, భట్లపెనుమర్రులో ముస్లింలు ఆదివారం పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్బలా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ వర్ధంతి నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. మిజావత్ మహమ్మద్ హుస్సేన్, ఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి



కైకలూరులో వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యులు



మండవల్లిలో కుక్కలకు టీకా వేస్తున్న ఏడీ వరప్రసాద్



మొవ్వలో కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ దివాకర్



గుడివాడలో కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యులు



గుడ్లవల్లేరులో కుక్కకు టీకా చేస్తున్న వైద్యుడు

కైకలూరు: పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రేబీస్ వ్యాక్సిన్ వేయించాలని కైకలూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్ పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా కైకలూరు పశు వైద్యశాలలో పెంపుడు జంతువుల పెంపకందారులకు జంతువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కైకలూరు, కలిదిండి మండలాల పశువైద్యశాలల్లో 241 ఉచిత రేబీస్ వ్యాక్సిన్లు పెంపుడు కుక్కలకు వేశామన్నారు. సిబ్బంది ఉషారాణి, అబ్దుల్ ఘనీ, జయరాం, లోకేష్, గంగాధర్, మనోజ్, ప్రసాద్ తితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని 126 పెంపుడు కుక్కలకు పశు వైద్యశాల్లో ఆదివారం రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ డీవీ వరప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వ ప్రాంతీయ పశు వైద్యాలయంలో ఆదివారం వరల్డ్ జూనోసిస్ డేను పురస్కరించుకుని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి నివారణకు టీకాలను ఆదివారం వేశారు. వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎంఎస్‌పీ దివాకర్ ఆధ్వర్యంలో కుక్కలను టీకాలు వేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: జూనోసిస్ డే ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల నందు పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. డాక్టర్ పి. రత్నశ్రీ మాట్లాడుతూ మరో రెండు రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు డివిజన్ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జునాసిస్ డేను పురస్కరించుకుని కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణ టీకాలను వేసేందుకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. కుక్కలకు టీకాలను వేయించేందుకు శునక ప్రేమికులు ఎక్కువగా వచ్చారు.

అంకమ్మతల్లికి ఆషాఢ సారె



జమీదగ్గుమిల్లిలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించిన భక్తులు



యాకమూరులో అంకమ్మతల్లికి ఆషాఢ సారెను తీసుకొస్తున్న భక్తులు



భట్లపెనుమర్రులో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

తోట్లవల్లూరు: బోలెం వారి అంకమ్మతల్లికి ఆషాఢ సారెను భక్తులు ఘనంగా సమర్పించారు. మండలంలోని యాకమూరులో వేంచేసిన బోలెం వారి అంకమ్మతల్లికి ఆడపడుచులు చీర, సారె, పూలు, పండ్లను ఆదివారం తీసుకుని మేళతాళాలతో తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలలో బోలెం వంశీకులు, ఆడపడుచులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

భట్లపెనుమర్రులో..

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రులో మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ సారెను తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గ్రామదేవత శ్రీగంగానమ్మ తల్లికి, శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి సమర్పించారు.

పామర్రులో..

జమీదగ్గుమిల్లి(పామర్రు): జమీదగ్గుమిల్లిలోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో సీతమ్మ వారికి భక్తులు ఆషాఢ సారెను ఆదివారం సమర్పించారు. తొలుత మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ, పూలు పళ్లు, చలిమిడి, నూతనవస్త్రాలు, గాజులు, కొబ్బరి బొండాలు, స్వీట్లు, హాట్లు తదితరాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు రావూరి ఉమాదేవి, విజయలక్ష్మి, ఉమా మహేశ్వరి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం గంగానమ్మ ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారెను ఆదివారం భక్తిశ్రద్ధలతో సమర్పించారు. గ్రామంలోని మహిళలంతా ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. అదేవిధంగా శ్రీహరిపురం శివారు చేవూరుపాలెంలోని పరసా వారి ఇలవేల్పు అంకమ్మ తల్లికి పరసా కుటుంబ సభ్యులు ఆషాఢ సారె సమర్పించారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు



గుడివాడలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పామర్రు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పామర్రులో దళిత గిరిజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి

గుడివాడ టౌన్: బాబూ జగ్జీవన్‌రామ్‌కు వర్ధంతిని ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, కేంద్ర మంత్రిగా, సంఘ సంస్కర్తగా జగ్జీవన్ రామ్ సమాజానికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎంపీపీ పెయ్యల ఆదాము, నాయకులు పాలేటి చంటి, అధికార ప్రతినిధి ఎంవీ నారాయణ రెడ్డి, షేక్ సయ్యద్, షేక్ బాజీ, గంటా శ్రీనివాసరావు, ఎ.కృష్ణమోహన్, కె. ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, మెండా కిరణ్, కె.కిరణ్, నీలాకాంత్, పి.రాజేష్, కె. నాగు, మూడెడ్ల ఉమ, రమీజా, సురేఖ, ఎం. రాణీ, హారిక పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: బలహీన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన మహోన్నతమైన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ మండల, టౌన్ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌కు భారత ప్రభుత్వం 'భారత రత్న' బిరుదు ఇచ్చి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, ఎం ఎస్, నందిరాజు, నత్తా నాని తదితరులు పాల్గొన్నారు.

– దళిత గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయవరపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక శివరామ సినీ థియేటర్‌లో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సిద్దెల జయరాజు, క్రైస్తవ సంఘ నాయకులు కొల్లాబత్తుల సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు



గుడివాడ టౌన్: విద్యను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత అని శ్రీ రాజరాజేశ్వరి ఫ్రూట్స్ అధినేత దూబ శివరాజేష్ అన్నారు. స్థానిక పెద్దవీధిలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరు విద్యార్థులను సత్కరించి ఆర్థిక పురస్కారం అందజేశారు. పట్టణానికి చెందిన కొవ్వాడ రేష్మశ్రీ మహాలక్ష్మి ఇంటర్మీడియట్ బైపీసీలో 989 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని, గొల్లపల్లి దేదీప్య ఎంపీసీలో 992 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వీరికి రూ. 10 వేలు అందజేసినట్లు తెలిపారు.

మానవత సేవలను విస్తృత పర్చాలి

పామర్రు: మానవత సేవలను మరింతగా విస్తృత పర్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మానవత రాష్ట్ర కన్వీనర్, ఉభయ కృష్ణా జిల్లా చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక అంకమ్మ తల్లి ఆలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. నూతన కార్యవర్గంలోని అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమ రావు, కార్యదర్శి అరిగెల బాలుడు, కోశాధికారి భీమవరపు శ్రీనివాసరెడ్డి, కార్యవర్గ సభ్యులచేత ప్రమాణ స్వీకరణ చేయించినట్లు పేర్కొన్నారు.

రామాలయానికి నూతన శోభ

రూ.25 లక్షలతో ముఖ మండపం నిర్మాణం



యాకమూరులో నిర్మించిన రామాలయ మండపం

తోట్లవల్లూరు: యాకమూరులోని శ్రీకోదండ రామస్వామి ఆలయం నూతన సొబగులతో ముస్తాబవుతోంది. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని 26 ఏళ్ల క్రితం గ్రామస్తులు పునర్నిర్మించారు. ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన వెలివెల వెంకటేశ్వర రావు, సత్యవతి దంపతుల కుమారులు సుధీర్‌కుమార్, రాజేష్‌కుమార్, వినయ్‌కుమార్ రూ. 3 లక్షలను విరాళంగా అందజేశారు. దీంతోపాటు గ్రామస్తులు కూడా దాతల నుంచి విరాళాలు సేకరించి ఆలయ మండపం నిర్మాణానికి రెండు నెలల క్రితం శ్రీకారం చుట్టారు. ఆలయ మండపం నిర్మాణం పూర్తి కావటంతో ఆలయం మొత్తాన్ని రంగులతో అందంగా తీర్చి దిద్దే కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. మరో 15 రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తవుతాయని చెబుతున్నారు. ముఖ మండపం నిర్మాణంతో రామాలయం నూతన శోభను సంతరించుకుంది. ఆలయ అభివృద్ధికి రూ. 25 లక్షల వరకు వ్యయం అవుతున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలియజేశారు. అభివృద్ధి పనులను ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి సుధీర్‌కుమార్, కోశాధికారి రాజేష్‌కుమార్, సభ్యులు ఆదినారాయణ, సతీష్, నాగేందర్‌రావు, కృష్ణకిషోర్, రామకృష్ణ; సాంబశివ రావు పర్యవేక్షిస్తున్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



పామర్రు: ఎంతో అరుదుగా పూసే బ్రహ్మకమలాలు పామర్రు ప్రజలను కనువిందు చేశాయి. స్థానిక విజయవాడరోడ్డులో నివసిస్తున్న కాకర్ల కృష్ణదాసు, పుష్పావతి దంపతులు ఇంట్లో హైదరాబాద్ నుంచి తెచ్చిన బ్రహ్మకమలం మొక్కను నాటారు. శనివారం రాత్రికి రెండు బ్రహ్మకమలాల పూలు విచ్చుకున్నాయి. స్థానికులు వాటిని చూసేందుకు ఆసక్తి చూపారు.

గంగానమ్మ తల్లికి ఉయ్యాల సమర్పణ



పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయానికి భక్తులు ఆదివారం ఉయ్యాలను సమర్పించారు. స్థానిక మార్కెట్ యార్డు హమాలీ అయిన ముప్పిరిశెట్టి ఉమా మహేశ్వరరావు, రాజ్యలక్ష్మి దంపతులు ఆలయానికి సుమారు రూ.18వేల విలువ గల ఉయ్యాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 జల బిందెలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలను చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఐనంపూడి(పామర్రు): మనం-వనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశామని ఆ ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఐనంపూడికి చెందిన గుంటూరు దొరబాబు లివర్‌కు సంబంధించిన వ్యాధితో ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు.

రేపు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం

పామర్రు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధ్యక్షతన స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో ఈ నెల 8న మధ్యాహ్నం మూడు గంటలకు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ అనే బాండ్లతో అమలుకు సాధ్యం కాని హామీలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారన్నారు. ఈ విధానాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

కైకలూరు: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. కైకలూరు మండలం ఆలపాడులో బీజేపీ నాయకుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖర్జీ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు.